"స్వామీ! మీరు మా కళ్ళెదుట ఉండగా మిమ్మల్ని కాక మీ పాదుకలకి నమస్కరిస్తున్నాం. ఎందుకిలా?"

"ఎందుకంటే నా కన్నా నా పాదుకలకి విలువ ఎక్కువ. ఆ మాటకొస్తే నీకన్నా నీ చెప్పులకే ఎక్కువ విలువ, గౌరవం అని నీకు తెలీదు." నవ్వి జవాబు చెప్పాడు గురువు.

"అదేమిటి? మీ కన్నా మీ పాదుకలకి ఎక్కువ విలువ ఉండచ్చు. కాని నాకన్నా నా చెప్పులకి ఎక్కువ గౌరవం అంటే నమ్మలేకపోతున్నాను. మీ పాదుకలకి మొక్కినట్లుగా నా చెప్పులకి ఎవరూ మొక్కరే?" అపనమ్మకంగా చూస్తూ అడిగాడు రాజు.

"ఒక్క నీ చెప్పులకే కాదు. ప్రపంచంలోని ఏ మనిషికన్నా అతని చెప్పులకే ఎక్కువ గౌరవం లభిస్తుంది." గురువు మళ్ళీ చెప్పాడు.

తను చెప్పేది రాజుకి అర్థం అయ్యేలా మళ్ళీ ఆ గురువు ఇలా చెప్పడు.

"నీ మంత్రి చెప్పులు చిరిగాయనుకో. అతను ఒక్క రాత్రికి నీ చెప్పులని నీ ఇంట్లో ఉంచి వెళతానంటే ఏమంటావు?" ప్రశ్నించాడు గురువు.

"సరేనంటాను." జవాబు చెప్పాడు రాజు.

"అదే అతను మరణిస్తే ఓ రాత్రికి అతని శవాన్ని మీ ఇంట్లో ఉంచమంటే ఏమంటావు?"

ఆ ప్రశ్నతో రాజుకి గురువు చెప్పిన మాటల వెనక సత్యం అర్థం అయింది.

## 108. నామస్మరణ మహత్యం

నామస్మరణ చేస్తే పాపాలు తగ్గుతాయి అని ఓ గురువు చెప్పిన హితబోధ ఆయన శిష్యుల్లో ఒకరికి అర్థం కాలేదు. రామ రామ లేదా కృష్ణ

కృష్ణ అనుకుంటే పాపాలు ఎలా తగ్గుతాయన్నది అతనికి బోధపడలేదు. ఆ సంగతి గ్రహించిన గురువు అతనికి ఓ ఆకుపచ్చ రంగు పెట్టెని, నల్ల రంగు పెట్టెని ఇచ్చి చెప్పాడు.

"ఇక మీదట నీ సుఖాల గురించి రాసిన కాగితాలు ఈ పచ్చరంగు పెట్టెలోనూ, కష్టాల గురించి రాసిన కాగితాలు ఈ నల్ల పెట్టెలోనూ వెయ్యి. నామ స్మరణని వదలకు."

శిష్యుడు గురువు చెప్పినట్లుగా చేయసాగాడు. కొంత కాలానికి ఆకుపచ్చ రంగు డబ్బా బరువెక్కడం, నల్ల డబ్బా తేలిక అవడం గమనించాడు. నల్ల డబ్బాతెరచి చూస్తే దానికి అడుగున వున్న రంధ్రం లోంచి కష్టాల కాగితాలు జారిపోవడం గమనించాడు. ఆకుపచ్చ పెట్టెలో రంధ్రం లేదు.

దైవ నామ స్మరణ వల్ల కష్టాలు తొలగుతాయని అతనికి ఆ ఉపమానం ద్వారా అర్థం అయాక నామ జపం మీద నమ్మకం ఏర్పడి ఆ శిష్యుడు దాన్ని అధికంగా చేయసాగాడు.

## 109. ఎవర్ని చూడాలి?

దాన ధర్మాలు విరివిగా చేసే ఓ ధనవంతుడికి మరణ కాలం సమీపించింది. మరణ శయ్య మీద వున్న అతన్ని వైద్యుడు అడిగాడు, అతను ఎవర్ని చూడాలనుకుంటున్నాడని.

"పక్కింటి బీదవాడిని పిలిపించండి. ఆయన్ని చూస్తాను." కోరాడా ధనవంతుడు.

"అదేమిటి? మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకునే మీ భార్య, నిజాయితీ పరుడైన వ్యాపారంలోని మీ భాగస్వామి, లేదా మీ పిల్లలు కాక మిమ్మల్ని చేయి చాచి అడిగి మీకు నష్టం కలిగించినతన్ని చూస్తానంటారేమిటి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు డాక్టర్.